



పేరు మారింది.. పైసలేవి?


ఆసుపత్రిలో గర్భిణికి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

- మదర్ చైల్డ్ హెల్త్‌గా అమ్మఒడి
- మూడేళ్లుగా అందని ప్రోత్సాహం
- అమ్మకు తప్పని నిరీక్షణ
- జిల్లాలో 18 వేల మంది లబ్ధిదారులు
- ప్రభుత్వం మారడంతో ప్రోత్సాహంపై అయోమయం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మాతా శిశు మరణాలను తగ్గించడం, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు గత ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రారంభించింది. నగదు ప్రోత్సాహంతోపాటు కేసీఆర్ కిట్ పేరుతో 16 వస్తువులను అందించింది. దీంతోపాటు పోషకాహార లోపం నివారణకు బాలింతలకు కిట్‌లు ఇస్తూ వచ్చింది. గత ప్రభుత్వం నుంచి నాలుగు విడతలుగా అందించే ప్రోత్సాహం మాత్రం రావడం లేదు. ఆరేళ్ల క్రితం జూన్ 3, 2017లో ప్రారంభమైన కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకంలో కిట్‌లు మాత్రం రెగ్యులర్‌గా అందిస్తున్నారు. ప్రోత్సాహం మాత్రం అందడం లేదు. కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచడానికి దోహదపడినా ప్రోత్సాహం అందించడంలో నిర్లక్ష్యమే చూపుతూ వచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2017 నుంచి 2023 డిసెంబరు వరకు ప్రభుత్వాస్పత్రుల్లో 47 శాతం ప్రసవాల సంఖ్య 80 శాతానికి పెరిగింది.

● జిల్లాలో మిషన్- 80 సక్సెస్

పేద కుటుంబాల్లో ప్రసవాలు ఆర్థికభారాన్ని నింపుతాయి. దానిని తొలగించడానికి కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం 'మిషన్ 80 శాతం' పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. విజయవంతంగా లక్ష్యాన్ని చేరుకుంది. జిల్లా ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆస్పత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ప్రసవాలు జరిగే విధంగా శ్రీకారం చుట్టారు. గతేడాది జూలై 1న ప్రారంభించిన మిషన్ 80 శాతం కార్యక్రమం ఫలితాలను ఇచ్చింది. అనుకున్నట్లుగానే డిసెంబరు మాసం వరకు ప్రసవాలు 80 శాతం వరకు ప్రభుత్వాస్పత్రుల్లో జరిగే దిశకు చేరుకున్నాయి. గతేడాది ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సగటున 50 శాతం మాత్రం జరిగేవి. గతేడాది ఫిబ్రవరిలో 54 శాతం, జూన్‌లో 63, జూలై 71, ఆగస్టు 76, సెప్టెంబరు 80, అక్టోబరు నవంబరులో 77, డిసెంబరులో 80 శాతం ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వంద శాతం ప్రసవాల లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందుకు పోతోంది. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచే దిశగా జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో హెల్త్ సూపర్‌వైజర్‌లు పీఆర్వోలకు బాధ్యతలను అప్పగించారు. మెటర్నిటీ ఎగ్జిక్యూటివ్‌లుగా నామకరణం చేశారు. మూడు షిఫ్టులలో 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. గర్భిణులు, ఆసుపత్రికి వచ్చిన తరువాత ఎవరిని కలవాలి. ఎక్కడ వైద్య పరీక్షలు చేయించుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉండేవి. వాటిని అధిగమించడానికి సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులు సులభంగా వారిని గుర్తించడం, వారు అవసరమైన సేవలను అందించి తిరిగి పంపించడం వంటి ఏర్పాట్లు చేశారు. ఏఎంసీ పరీక్షలకు వచ్చిన సమయంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు గర్భిణులకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తారు. రెండు ఆసుపత్రులతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా గర్భిణులకు సేవలు అందించడం, సుఖ ప్రసవానికి అవసరమైన వ్యాయమాలు సిబ్బంది దగ్గరుండి చేయించారు. మాతృసేవ పేరుతో గర్భిణులకు సేవలు అందిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాష్ సర్టిఫికేట్‌లు వచ్చేలా బలోపేతం చేశారు. కానీ ప్రభుత్వం అందించాల్సిన ప్రోత్సాహక నగదు మాత్రం అందించకపోవడం నిరాశను కలిగించింది.

జిల్లాలో రూ.14.02 కోట్ల బకాయిలు

జిల్లాలో గర్భిణులకు గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కిట్ పథకం ద్వారా కిట్లు, ప్రోత్సాహాన్ని అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్‌లను కొనసాగించినా పేరును మదర్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్)గా మార్చింది. పేరు మారినా కొత్త ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలోని బకాయిలును చెల్లిస్తుందో? లేదోననే అయోమయం నెలకొంది. జిల్లాలో మూడేళ్లగా నగదు ప్రోత్సాహం బకాయిలకోసం దాదాపు 18 వేల మంది గర్భిణులు, బాలింతలు, పాలిచ్చే తల్లులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో రూ .14 కోట్ల 2 లక్షల 71 వేల బకాయిలు ఉన్నాయి. ఇందులో మొదటి విడతలో గర్భం దాల్చిన తరువాత ప్రసవాల సమయంలో రూ.3 వేలు అందిస్తారు. రెండవ విడతలో మగ బిడ్డ పుడితే రూ.4 వేలు, ఆడబిడ్డ పుడితే రూ.5వేలు, మూడో విడతలో ఇమ్యూనైజేషన్ సమయంలో రూ.2 వేలు, చివరి ఇమ్యూనైజేషన్ నాలుగో విడతలో రూ.3వేలు తల్లి ఖాతాలో జమచేస్తారు. ఇలా ఇప్పటి వరకు రూ.14.02 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. మొదటి విడతకు సంబంధించి 12,104 మంది లబ్ధిదారులకు రూ.3,63,12,000, ప్రసవం తరువాత రెండో విడతల 8476 మంది బాలింతలకు రూ.3,81,42,000, మొదటి ఇమ్యూనైజేషన్ 13,854 మంది లబ్ధిదారులకు రూ.2,71,68,000, రెండో ఇమ్యూనైజేషన్ 12,883 మంది లబ్ధిదారులకు రూ.3,86,49,000 బకాయిలు రావాల్సి ఉంది. కిట్లు అందిస్తూ వస్తున్నా కొత్త ప్రభుత్వం ప్రోత్సాహకాలు మాత్రం అందించడం లేదు. మాతా శిశు సంరక్షణ పేరుతో న్యూటిషన్ కిట్లు కూడా ఇస్తున్నారు. కొన్ని చోట్ల కిట్ల కొరత కూడా ప్రధానంగా కనిపిస్తోంది.

రాజన్నకు మేడారం భక్తుల మొక్కులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునే క్రమంలో సోమవారం సుమారు 40 వేల మందికిపైగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేశారు. స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. వేలాది మంది భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణంతోపాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19: జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి కోరారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో సోమవారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహణపై వైద్య, ఐసీడీఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్, సెస్, లయన్స్, రోటరీ క్లబ్, జిల్లా సంక్షేమశాఖ, వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బస్టాండ్, మార్కెట్, ఇతర ప్రాంతాల్లో పోస్టర్లను ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో 5 సంవత్సరాలలోపు పిల్లలు మొత్తం 44వేల 770 మంది ఉన్నారని ఇన్‌చార్జి జిల్లావైద్యాధికారి డాక్టర్ రజిత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 394 పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు, పిల్లందరికి పల్స్‌పోలియో చుక్కలను వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డీపీవో వీరబుచ్చయ్య, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నయిమా, సీడీపీవోలు ఎల్లయ్య, అలేఖ్య, మున్సిపల్ డీఈ ప్రసాద్, జీసీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నేటితరం బాలల్లో సామాజిక స్పృహ లోపం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19: నేటితరంలో బాలల్లో సామాజిక స్పృహ లోపించిందని, గత తరానికి నేటి తరానికి వారధి నెలకొల్పేది సాహిత్యం ఒక్కటేనని తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో కవితలు, కథలు, పాటలపై బాలలకు కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక అంశాలను ఎన్నుకొని కథలు, కవితలు, పాటలను రాయాలని సూచించారు. జ్ఞానపీఠ అవార్డ గ్రహీత స్వర్గీయ డాక్టర్ సీనారాయణరెడ్డితోపాటు ఎంతో మంది మేధావులు ఈ పాఠశాలలోనే చదువుకున్నారన్నారు. కథలపై గరిపెల్లి అశోక్, కవిత్వంపై బూర వెంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, పాటలపై వెంగలి నాగరాజు తరగతులను బోధించారు. ఈ కార్యక్రమంలో రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పాకాల శంకర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు లకావత్‌మోతీలాల్, స్టాఫ్ కార్యదర్శి మాల్లారపు పురుషోత్తం, తెలుగు ఉపాధ్యాయులు సమ్మయ్య శ్రీనివాస్‌రెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 19 : గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్, కెరీర్‌గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, టాస్క్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ఐక్యూఏసీ కో ర్డినేటర్ అంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్ దర్మపురి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ వాణి, అధ్యాపకులు శ్రీనివాస్, భిక్షమయ్య మనోహర్, కృష్ణప్రసాద్ విజయ్, మహేస్, రాజేష్, ఉమారాణి, శ్రావణి, రజిత, శిరీష తదితరులు ఉన్నారు.

రాజన్న సేవలో సినీ నటుడు సుమన్

వేములవాడ, ఫిబ్రవరి 19 : వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ప్రముఖ సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ శ్రీరాములు, పరిశీలకుడు పవన్ ఉన్నారు.

మహిమ గల దేవుడు వేములవాడ రాజన్న

వేములవాడ రాజరాజేశ్వరస్వామివారు అత్యంత మహిమ గల దేవుడని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ వేములవాడ పుణ్యక్షేత్రం మహిమాన్వితమైన క్షేత్రమని, రాజరాజేశ్వరస్వామివారు అత్యంత మహిమ కలిగిన దేవుడని అందుకే ప్రతీనిత్యం వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తున్నారని అన్నారు.

మల్లన్న పట్నాల్లో ఆది శ్రీనివాస్

రుద్రంగి, ఫిబ్రవరి 19: రుద్రంగి మండల కేంద్రంలో వివాహ వేడుకలు, మల్లన్న పట్నాలకు సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అంజయ్య ఇంట్లో జరిగిన మల్లన్న పట్నం వేడుకల్లో ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మనోహర్, గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను వంద శాతం అమలు చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- శివాజీ, గాంధీ విగ్రహ ఆవిష్కరణ


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బోయినపల్లి, ఫిబ్రవరి 19: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోయినపల్లి మండలం నీలోజుపల్లిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ 394వ జయంతి ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ, గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేయడంతో పథకాల అమలుకు కొంత ఆలస్యం జరుగుతోందన్నారు. హామీలను త్వరితగతిన అమలు చేస్తామన్నారు. సమ్మక్క, సారక్క జాతర దృష్ట్యా 6 వేల బస్సులను కేటాయించామని, మహిళలు జాతర ముగిసే వరకు అసౌకర్యంగా భావించవద్దని అన్నారు. అంతే కాకుండా మహానీయుల విగ్రహాలను గ్రామంలో నెలకొల్పడం అభినందనీయమని, వారి పోరాట పటిమ స్ఫూర్తిగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని అన్నారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను మంత్రి పొన్నం, మేడిపల్లిసత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లామని అన్నారు. నిర్వాసితుల సమస్యలను సత్వరమే పరిష్కారిస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, మాజీ జడ్పీటీసీ బోలుమాల శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మండల అరెకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిమ్మాపురం సత్యం తదితరులు పాల్గొన్నారు.

అణగారిన ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందజేస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఫిబ్రవరి 19 : అణగారిన ప్రజల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. త్వరలోనే మరో రెండు పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్ పాలన ముగిసిందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాజకీయాలకతీతంగా వేములవాడ నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. తహసీల్దార్ విజయప్రకాశరావు, మండల పరిషత్ వైస్ చైర్మన్ వంగపల్లి సుమలత, ఎంపిటిసి యాస్మిన్ భాష, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ జిల్లా నాయకులు చెందనగిరి గోపాల్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలకు తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బంది వివరాలు తీసుకొని ఎపిక్ నెంబరుతో సహా ఆన్లైన్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి మాట్లాడుతూ తుది ఓటరు జాబితా ప్రచురించి అన్ని పోలింగ్ స్టేషన్లు, రాజకీయ పార్టీలకు పంపించినట్లు చెప్పారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్ కుమార్, మధుసూదన్, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస చారి, ఏపీడీ నర్సింహులు, తహశీల్దార్ షరీఫ్ మోయినుద్దీన్ పాల్గొన్నారు.

జిల్లా పౌర సంబంధాల అధికారి బాధ్యతల స్వీకరణ


శ్రీధర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19: జిల్లా పౌర సంబంధాల అధికారిగా వంగరి శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భూపాలపల్లి జిల్లాలో పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో జిల్లాకు వచ్చారు. జిల్లా పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.దశరథం వద్ద నుంచి శ్రీధర్ సోమవారం జిల్లా పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్కసారలమ్మ జాతర డ్యూటీ డిప్యూటేషన్‌పైఫిబ్రవరి 26 నుంచి విధులకు హాజరు కానున్నారు.

చందుర్తి ఎస్సైగా శ్రీకాంత్

చందుర్తి, ఫిబ్రవరి 19: చందుర్తి ఎస్సైగా సీహెచ్ శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు కామారెడ్డి జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఎస్‌బి ఎస్సైగా విధులు నిర్వహించి చందుర్తికి వచ్చారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని, ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రజలకు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం అవగాహన కల్పించారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ ఇటీవల దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ ప్రధాన కూడళ్లు, ఇంటి ఆవరణల్లో సీసీ కెమె రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అను మానా స్పదంగా సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. బ్లూకోల్ట్ కానిస్టేబుల్ సతీష్, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

నాగరాజుకు ఉత్తమ గీత రచయిత అవార్డు

సిరిసిల్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు, జానపద గేయ రచయిత వెంగళి నాగరాజుకు అస్థిత్వం సంస్థ ఉత్తమ గీత రచయితగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ, అస్థిత్వం సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో నాగరాజుకు అవార్డును అందజేయనున్నారు. జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కాపేటకు చెందిన నాగరాజు 18 సంవత్సరాలుగా తనదైన శైలిలో జానపద గేయాలు బాలల పాటలు రాయడంతోపాటు అద్భుతంగా గానం చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. నాగరాజు అవార్డు అందుకోవడంపై అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరగోని చైతన్యగౌడ్, కార్యనిర్వాహఖ కార్యదర్శి పాకాల శంకర్‌గౌడ్, మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, వెంగళ లక్ష్మణ్, సాయికుమార్ అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19:ఇల్లంతకుంట ఎస్సైగా ప్రశాంత్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా పనిచేసిన సుధాకర్ బదిలీపై తంగళ్లపల్లికి వెళ్లారు.అక్కడ పనిచేస్తున్న ప్రశాంత్‌రెడ్డి ఇల్లంతకుంటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. సమస్యలుంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి సాయి బాబా ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం అర్చకులు అన్వేష్‌ఆచార్య, అభిలాష్‌ఆచార్య ఆధ్వర్యంలో స్వామివారి సుప్రభాతం, నిత్య పూజ, గణపతి పూజ, నవకలశ స్థాపన, నవగ్రహ హోమం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారి పల్లకి సేవ చేపట్టారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ పద్మ, ఆయా పార్టీల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా భక్తజన మండలి సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సిరిమల్లెలు పుస్తకానికి బాలల ప్రతిభా పురస్కారం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 : సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థ సిరిమల్లెలు పుస్తకానికి బాలల ప్రతిభా పురస్కారం 2023 లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్ సోమవారం ప్రకటించారు. ముస్తాబాద్‌లోని డాక్టర్ చింతోజు బ్రహ్మయ్యబాలమణి మోమోరియల్ ఎడ్యూకేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిరిమల్లెలు పుస్తకాన్ని ఎంపిక చేశారని పేర్కొన్నారు. బాలల ప్రతిభా పురస్కారంతోపాటు నగదుపారితోషికం, ప్రశంసపత్రాలను సోమవారం పాఠశాలలో పుస్తకాన్ని రచించిన విద్యార్థుతోపాలు ఉపాధ్యాయులకు ప్రముఖ కవి,రచయిత గరిపెల్లి అశోక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాతూరి మహేందర్‌రెడ్డి, పాకాల శంకర్‌గౌడ్, మల్లారపు పురుషోత్తం, రవీందర్, కమ్మరి మల్లేశం, దేవత ప్రభాకర్, గోవిందరావు, సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నారాయణ, అజయ్, వెంకటేశం, సాంబయ్య లక్ష్మయ్య, నజీర్, సంధ్యారాణి, సరిత, నీరజ, ఫాతిమా, సూర్యకళ, రజిత పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

గంభీరావుపేట, ఫిబ్రవరి 19 : గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్‌తో రావాలని సూచించారు.

వైకుంఠ రథానికి నిధులు మంజూరు

బోయినపల్లి, ఫిబ్రవరి 19: బోయినపల్లి మండలం నీలోజుపల్లి గ్రామంలో వైకుంఠ రథానికి ఎంపీ బండి సంజయ్ రూ.2 లక్షల నిధులను మంజూరు చేసినట్లు బీజేవైఎం నాయకులు హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేసిన బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ


అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌లు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19: సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో అధికారుల చుట్టూ తిరిగి వేసారిపోయిన ప్రజలు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌లతోపాటు జిల్లా అధికారులకు అర్జీలను అందించి సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణికి జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలిరావడంతో కలెక్టరేట్ కిక్కిరిసింది. ప్రజావాణిలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రాలను అందించారు. ప్రజావాణికి 37 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 22, సర్వేయర్‌కు 3, జిల్లా వైద్యాశాఖకు 2, సిరిసిల్ల మున్సిపాల్టీకి 2, జిల్లా పంచాయితీ శాఖకు 2, డీసీఎస్‌వో, డీఆర్‌డీవో, తంగళ్లపల్లి ఎంపీడీవో, ఎస్సీ కార్పొరేషన్, సిరిసిల్ల జిల్లా ఆసుపత్రి, ఉపాధి కల్పన కార్యాలయం, విద్యాశాఖ, మిషన్ భగీరథలకు ఒకటి చొప్పున అర్జీలు వచ్చాయి.

అర్జీలను పరిశీలించాలి

ప్రజావాణికి వచ్చే అర్జీలను సంబంధిత జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, న్యాయం చేయడంతోపాటు సమస్యలపై లిఖిత పూర్వకంగా సమాధానాలను అందించాలని అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ ఆదేశించారు. ఆర్డీవోలు అనంద్‌కుమార్, మధుసూధన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైల్వే బాధితులకు న్యాయం చేయండి

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని నాంపల్లి , అనుపురం, కొడుముంజ, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాల నుంచి కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ పోతోందని, ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న తమకు తీరని అన్యాయం జరుగుతోందని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. రైల్వే లైన్ అలైన్ మెంట్‌లలో మార్పులు చేసి తమకు న్యాయం చేయాలని లేకుంటే ఎకరానికి రూ.20లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు అదనపు కలెక్టర్‌లకు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, గుడూరి శంకర్, ఆర్రె మహేష్, నర్సారెడ్డి , రాము, దూస రవీందర్, పులి మహేష్, లాలా పద్మ, రాచర్ల శ్రీనివాస్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులను తిరిగి తీసుకోవాలి

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమను తిరిగి తీసుకోవాలని స్టాఫ్ నర్సులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా అదనపు కలెక్టర్‌లను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఏరియా ఆసుపత్రిలో రెగ్యూలర్ నర్సింగ్ స్టాఫ్‌ను విధుల్లోకి తీసుకోవడంతో అవుట్ సోర్సింగ్ విభాగం నుంచి చేరిన తమను విధులనుంచి తొలగించారని, గతంలో ప్రాణాలను తెగించి కరోనా సమయంలో విధులను నిర్వర్తించామని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.జ్యోతి, రుచిత, దీపిక, జ్యోతి, మమత, శ్రీలత, బాలకృష్ణ, సునిత పాల్గొన్నారు.

వేతనం ఇప్పించండి

మిషన్ భగీరథ ఇంట్రా విభాగంలో సిరిసిల్ల డివిజన్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా 8 సంవత్సరాలుగా పని చేశానని, గతేడాది జీతం ఇప్పించి ఆదుకోవాలని మధుసూదన్ కోరాడు. జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమికి వినతి పత్రాన్ని అందించాడు. కొద్ది రోజుల నుంచి మిషన్ భగీరథ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!

» 28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా... ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.


ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్టు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.

పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటురునాగారం ఐటీడీఏ పీవో సంతకం

మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

– భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ

» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్థక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్థక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు

» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర

» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్నన్ల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ..
బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని రజక సంఘం 1 ఆధ్వర్యంలో సోమవారం మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పెద్ద చెరువు కట్ట కింద రజక సంఘం నాయకులు , ప్రజాప్రతినిధులు ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసి పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు కనమేని చక్రధర్‌రెడ్డి, గుండెల్లి శ్రీనివాస్, గజ్జెల రాజు, కంచం నర్సింలు, మిరుదొడ్డి భాను, రంజాని రాజలింగం, వేముల సత్యనారాయణ, రజక సంఘం నాయకులు మిరదొడ్డి గిరి, మిరుదొడ్డి దేవయ్య, హనుమయ్య, రవిందర్, బాల్‌రాజు, బాబు, భాను, నర్సింలు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా
జిల్లా ఉపాధ్యక్షురాలు, కార్యదర్శులుగా జ్యోతి, కీర్తిశ్రీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, జిల్లా కార్యదర్శులుగా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి గ్రామానికి చెందిన పిడిసుట్ల జ్యోతి, ఆరేటి కీర్తిశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ విభాగం జిల్లా అధ్యక్షురాలు బుర్కం లక్ష్మీ సోమవారం నియమాక పత్రం అందజేశారు. నాయకులు ఆంజనేయులు, రవినాయక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెరుకు మోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెరుకు మోహన్ నియామక పత్రాన్ని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం కృషి చేస్తానన్నారు. ఎస్సీ సెల్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, నాయకులు కొమ్ము త్యాగరాజు, గడ్డం కిరణ్, రెబ్బ శ్రీను, నల్ల రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి శంకర్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 19: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేములవాడ పట్టణానికి చెందిన కుమ్మరిశంకర్‌ను అధిష్ఠానం రెండోసారి నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రెండోసారి తనకు అవకాశం కల్పించిన పార్టీ అదిష్ఠానానికి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ కులగణనపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 :కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనకు ముందుకు రావడం హర్షణీయమని సిరిసిల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. సోమవారం పద్మశాలి సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ కులాల జనగణన బిల్లును ఆమోదింప జేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి సంఘం డైరెక్టర్లు వెంకటేశం, రాములు, శ్రీనివాస్, కల్లెపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘానికి డీజే వితరణ

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి ముస్తాబాద్‌లో సోమవారం రూ.1.25 లక్షల డీజేను ఆర్య వైశ్య అందజేశారు. ఆర్య వైశ్య సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కూర భిక్షపతి, జడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పప్పుల శ్రీకాంత్, బండారి సత్తయ్య, ఉప్పల చంద్రం, మురికి వెంకటేశం, పప్పుల శ్రీను, కూర నగేశ్, నార్ల శ్రీనివాస్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా నందం

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: మండలంలోని కొండాపూర్‌లో శివాలయ, సాయిబాబ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సర్దాని నందం, ఉపాధ్యాక్షుడిగా చిగురు వెంకన్న, కోశాధికారిగా నారోజు చారి, సలహాదారులుగా మాదాసు భూమయ్య, సుతారి దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా బాలల్‌రెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని మాజీ సర్పంచ్ లక్ష్మీ, కరుణాకర్ అభినందించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 : మండలంలోని పోతుగల్ గ్రామంలో ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం... పోతుగల్ గ్రామానికి చెందిన కొండూగారి దేవరాజుతో ఎల్లారెడ్డిపేట మండలం గజసింగారం గ్రామానికి చెందిన లాస్యకు మూడేళ్ల క్రితం వివాహమైంది. లాస్య సిద్దిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో ఓ వైపు వరకట్న వేధింపులు, మరో వైపు సిద్దిపేటలో పనిచేస్తున్న క్రమంలో భర్త అనుమానాన్ని భరించ లేక ఆదివారం మధ్యాహ్నం పోతుగల్‌లోని అత్తగారింట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందన్న వైద్యుల సూచనల మేరకు సిద్దిపేటకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. లాస్య తండ్రి ఫిర్యాదుతో భర్త దేవరాజు, అత్త వజ్రమ్మ, మామ నర్సయ్య, ప్రవీణ్, కళ్యాణిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గంభీరావుపేట మండల ముదిరాజ్ సంఘం కార్యవర్గం

గంభీరావుపేట, ఫిబ్రవరి 19 : గంభీరావుపేట మండల ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికకు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్శ హన్మండ్లు హాజరయ్యారు. మండల అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మన్, ప్రధాన కార్యదర్శిగా పిట్ల బాబు, ఉపాధ్యక్షులుగా మచ్చ ఆనందం, పిట్ల నర్సయ్య, కోశాదికారిగా తోక దేవదాసు, సంయుక్త కార్యదర్శులుగా పిడుగు విజయ్, రమేష్, ముఖ్య సలహాదారులుగా నాగారపు దేవేందర్, ఓరుగంటి నర్సింలు, అరిగె రమేష్, కార్యవర్గ సభ్యులుగా జజ్జరీ రమేష్, పర్శ రవి, చాత్రబోయిన బాలయ్య, బీమరి రాజు, రంగు దేవయ్య, గాడిచర్ల రాములు, పెర్కిమెల్లి రమేష్, శివంది లింగంను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిరిసిల్లక్రైం, ఫిబ్రవరి 19: సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులో సోమవారం రాత్రి లారీ సైక్లిస్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముష్టిపల్లి గ్రామానికి చెందిన దొంతరవేణి వెంకటికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వెంకటిని స్థానికులు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, సమస్యలను పరిష్కారించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా పంచాయతీ అధికారిగా విధుల్లో చేరిన వీరబుచ్చయ్యను సీఐటీయూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామాల్లో పని చేసే పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు వారి కుటుంబాలను పోషించుకోలేక అప్పులు చేస్తూ ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారని అన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేష్, గ్రామపం చాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాల్యాల నర్సయ్య వర్కోలు మల్లయ్య, లింగంపెల్లి కృష్ణవేణి, అక్కల అంజయ్య, సందెల మహేష్, కంసాని రవీందర్, రాములు, తిమ్మయ్య పాల్గొన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సోమవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాల ఫలితంగా సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సిరిసిల్లలో సుమారు 80 శాతం పవర్‌లూమ్స్ బంద్ అయ్యాయని, దానిపై ఆధారపడిన కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఓట్లతో గెలుస్తూ రెండుసార్లు మంత్రిగా వెలగబెట్టిన కేటీఆర్ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో పవర్‌లూం సంక్షోభంపై మాట్లాడక పోవడం దురదృష్టకరమన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి పోవడానికి ప్రధాన కారణం ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్ ప్రభుత్వ నుంచి డబ్బులు వచ్చే విధంగా చర్యలు చేపట్టక పోవడమేనన్నారు. సిరిసిల్ల సంక్షోభానికి కారణమైన కేటీఆర్ కార్మికులకు, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్ర సంక్షోభాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆర్డర్లను సిరిసిల్ల నుంచి ఉత్పత్తి చేయించనున్నట్లు, 365 రోజులు సిరిసిల్లలోని కార్మికులకు పని కల్పించనున్నట్లు చెప్పారన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 19 : వీరత్వానికి ప్రతీక చత్రపతి శివాజీ అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జయవరం గ్రామంలో సోమవారం చత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. చత్రిపతి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చత్రపతి శివాజీని యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఇల్లంతకుంట: విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు ఏగుర్ల శ్రీనివాస్, నాయకులు కాసుపాక కిషన్, కూనబోయిన బాలరాజు, మామిడి రాజు, రమేష్‌సింగ్, రాజేశ్వరశర్మ, చేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్లలో సోమవారం చత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని హిందూ సాంస్కృతిక సమితి, భజరంగ్ దళ్, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక పాత బస్టాండ్ చేనేత విగ్రహం వద్దకు వచ్చారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ విగ్రహంతో పాటు చేనేత విగ్రహానికి నాయకులు పూల మాలలువేసి ర్యాలీని ప్రారంభించారు. భజరంగ్‌దళ్ నాయకులతో పాటు బీజేపీ పార్లమెంటరీ కో కన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లాఉపాధ్యక్షుడు శీలం రాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, గరిపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, పోతుగల్, గూడెం, బందనకల్, చిప్పలపెల్లిలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, అఖిల పక్షం నాయకులు తాడెపు ఎల్లం, లచ్చయ్య సెర్, కొమ్మెట రాజమల్లు, మల్లేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: యువత చత్రపతి శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని వక్తలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో శివాజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, నారాయణపూర్, అల్మాస్‌పూర్, గుండారం, బొప్పాపూర్, గొల్లపల్లి తదితర గ్రామాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చత్రపతి శివాజీ చిత్ర పటంతో భారీ ప్రదర్శన చేపట్టారు. శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. దేశ యువతకు శివాజీ మహరాజ్ మార్గదర్శకుడన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఏబీవీపీ, భజరంగ్ దళ్, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం హిందు సేవా సమితి ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో శోభాయాత్ర సాగింది. రామాలయం నుంచి ప్రారంభమైన శివాజీ మహరాజ్ శోభాయాత్ర గ్రామంలోని వీదుల వెంట కొనసాగింది.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో సోమవారం గ్రామానికి చెందిన కాసుగంటి రాజు ఆధ్వర్యంలో శివాజీ యూత్ సభ్యులు చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాగుల బాలయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణగా అందించారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో పాటు నాగారం, మంగళపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో చత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంతోపాటు ఎనగల్, జోగాపూర్, మరిగడ్డ తదితర గ్రామాల్లో సోమవారం చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జోగాపూర్‌లో జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్ శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సభ్యులు సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, హన్మయ్యచారి, మల్లేశం, వికాస్, వెంకటేష్, తిరుపతి, రాము, వివేక్, రాకేష్, సతీష్, కరుణాకర్, రాజు, నిశాంత్, సంపత్, సురేష్, ప్రేమ్, తిరుపతి, మహేందర్ అల్గొన్నారు.


సిరిసిల్లలో శోభాయాత్ర

నేడు ఆంజనేయస్వామి ఆలయ
పునః ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 20న వేదపండితులు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ఉదయం శాన్తిపాఠం, స్వస్తివాచనం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవతా హవనం, ఈ నెల 21న మూలమంత్ర హవనం, ధాన్యాధివాస, పుష్పాధివాస, ఫలాధివాస, ఈ నెల 22న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సత్తయ్యతోపాటు గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీవో వజీర్‌అహ్మద్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌ను మండలంలోని గుండారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం సన్మానించారు. గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చిత్ర పటాలను అందజేశారు. నాయకులు రాజునాయక్, రాజేందర్, ముస్సిన్‌రాథోడ్, ప్రశాంత్, శ్రీకాంత్‌రాథోడ్, కిషన్‌చారి, గంగారంనాయక్, శ్రీను, దేవయ్య, జగ్మల్, లచ్చిరాం, జయరాం, కిషన్, రాజు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు నేవూరి చంద్రారెడ్డి సోమవారం అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలోని లక్ష్మీ-చంద్రారెడ్డి దంపతుల కొడుకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి గ్రామ శివారులో నూతన భవనాలు నిర్మించుకొని కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఉపాధి కోసం ఇద్దరు కొడుకులు గల్ఫ్ దేశానికి వెళ్లారు. పాత ఇంటిలో భార్యాభర్తలు లక్ష్మీ-చంద్రారెడ్డి జీవిస్తున్నారు. చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 18న కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. సోమవారం ఉదయం నిద్ర లేచే సరికి చంద్రారెడ్డి కనిపించకుండా పోయాడని తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

విద్యారంగానికి కాంగ్రెస్ అధిక ప్రాధాన్యం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యా ర్థులకు ఎతో మేలు చేశారని, పాఠశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సైతం అలాంటి పాలననే ప్రజలకు అందించాలని కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జడల లక్ష్మీశ్రీనివాస్, నీలం కళ్యాణిశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి నాయకులు కాశ శ్రీనివాస్, బొజ్జ భారతి, చిలివేరి శ్రీనివాస్, సత్తయ్య, పోసవేని నాగరాజు, రాగిరి నాగరాజు తదితరులు ఉన్నారు.

● భారతదేశ చరిత్రలో చత్రపతి శివాజీ పేరును సువర్ణాక్షరాలతో లిఖించదగిన గొప్ప వీరుడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కొనియాడారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యోరుపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

మల్లన్నసాగర్ నీళ్లతో మునిగిపోతున్న భూములు


మాట్లాడుతున్న చీకోడు గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా చీకోడు శివారులోని చింతల చెరువులోకి నీటిని నింపడంతో 110 ఎకరాల పంట భూములు మునిగిపోతున్నాయని, పంటలు మునిగిపోవడంతో తమకు ఉపాధి లేకుండా పోతోందని ఆ నీటిని నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన చింతల చెరువు బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. మల్లన్నసాగర్ నీటిని చింతల చెరువుకు తీసుకు రావద్దంటూ ఆందోళన చేయ డంతోపాటు జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమికి వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చీకోడ శివారులో చింతల చెరువు కింద 110 ఎరకాల పట్టా భూములు ఉన్నాయని, వాటిపై ఆధారపడి పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చీకోడు చింతల చెరువులోకి మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకొచ్చి నింపిందన్నారు. ఆ చెరువులోకి వచ్చిన నీటిని కిందకు పంపిస్తామని చెప్పి పంపించలేదని, స్టోరేజీ చేయడంతో తమ భూముల్లోకి నీరు చేరి పంటలు మునిగిపోతున్నాయని అన్నారు. వినతి పత్రాలు ఇచ్చినా న్యాయం జరుగలేదని మళ్లీ నీటిని తీసుకవచ్చేప్రయత్నాలు జరుగుతున్నాయని, రాకుండా నిలిపివేయాలని కోరారు. మాజీ సర్పంచ్ కొంపెల్లి శ్రీనివాస్, అరెపల్లి విమమూర్తి,ఎల్లం, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న చేరికలు


ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 19: వేములవాడ పట్టణంలోని 25వ వార్డుకు చెందిన చెందిన కొక్కుల బాలకృష్ణ (రాజు) సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. సుమారు 150 మంది అనుచరులతో కాంగ్రెస్‌లో చేరిన ఆయనకు ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సమక్షంలో కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు సంఘ స్వామి, తూమ్ మధు, అరుణ్ తేజ చారి, 25వ వార్డుకు చెందిన పలువురు పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచి ప్రారంభం

వేములవాడ, ఫిబ్రవరి 19 : వేములవాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వేములవాడ శాఖను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, స్థానిక కౌన్సిలర్ యాచమనేని శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న పికప్ వాహనాన్ని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో హెడ్ కానిస్టేబుల్ ఆది శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుక లోడుతో వస్తున్న వాహనాన్ని ఆపారని పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి గొల్లపల్లికి చెందిన వాహన యజమాని, డ్రైవర్ గంతుల సత్తయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 19 : మర్రిపల్లి జిల్లాపరిషత్ విద్యార్థులకు వ్యవసాయకళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషనాత్మక తలనం కార్యక్రమంలో బాగంగా వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతు వేదికలో సామాజిక వనరులు, ప్రిఫరెన్స్, ర్యాంకింగ్, మ్యాట్రిక్స్ ర్యాంకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, సందీప్, విద్యార్థులు , గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 : ముస్తాబాద్ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు జిల్లా స్థాయిలో రాణించి ద్వితీయ స్థానం పొందారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ పర్యావరణం అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో భాగంగా సిరిసిల్లా జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థిని డ్రామా కంపెటీషన్ ఆల్టర్నేటివ్ ఆఫ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లో ద్వితీయ స్థానం పొందింది. ఆదర్శ పాఠశాలకు చెందిన వైష్ణవికి ఏకపాత్రభినయంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ ప్రత్యేధికారి శ్రీలత అభినందించారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చందనం మల్లేశం ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగి చికిత్స చేయించుకున్న ఆయనను ఆ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు నర్సయ్య గిరిధర్‌రెడ్డి, రాములు, బాబు, గౌస్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

సిరిసిల్ల రూరల్ ఫిబ్రవరి 19: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పలు పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం టాలెంట్ టెస్ట్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డిలతోపాటు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్‌కుమార్, మాల్లారపు ప్రశాంత్ నాయకులు సాయి, భాను, అదిత్య వేణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల సాధనతో పాటు విద్యార్థుల్లో దాగి సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేశ్, టీపీటీఎఫ్ నాయకులు ఎల్లారెడ్డి, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

గంభీరావుపేట: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగ పడుతోందని ఎస్ఐ రాంమోహన్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు దమ్మన్నపేట మాడల్ స్కూల్, లింగన్నపేట తదితర గ్రామాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రమేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

వీర్నపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్టులతో సృజనాత్మకత వెలికితీయడంతో పాటు భయాన్ని తగ్గించవచ్చన్నారు. అభ్యుదయ పుస్తకాలతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు సంధ్యరాణి, నరేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారిపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19: సిరిసిల్ల మున్సిపల్‌లో సుదీర్ఘకాలంగా ఉంటూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీపై విచారణ చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నుంచి టౌన్ ప్లానింగ్ అధికారిగా ఇక్కడే పని చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటన్నారు. సిరిసిల్లలో లైసెన్సుడ్ టౌన్ ప్లానర్స్ 10 నుంచి 16 మంది ఒక వర్గానికి చెందిన వారు ఉన్నారని, ఇంకో వర్గానికి చెందిన వారితోనే ప్లానింగ్ చేయిస్తూ అవినీతికి పాల్పొడుతున్నారని ఆరోపించారు.వారు ఇచ్చిన ప్లాన్‌కు మాత్రమే అనుమతులు ఇస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు ఎనగంటి నరేష్, గాజుల సదానందం, మోర శ్రీహరి, చొప్పదండి శ్రీనివాస్, బండారి వెంకటేశ్వర్లు, వేముల సురేష్, రచ్చ రాహుల్, మహేషుని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలు విడుదల చేయాలి


బిక్కవాగు వంతెనపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19: బిక్కవాగులోకి అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా కాళేశ్వర జలాలను విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని బిక్కవాగు వంతెనపై సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలానికి రెండువైపుల ప్రాజెక్టులు ఉన్నా సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి దృష్టికి సమస్య పోయినా ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. మధ్యమానేరు నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న ప్రభుత్వం అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిక్కవాగులోకి నీటిని విడుదల చేయాలని, లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. మండల ప్రధానకార్యదర్శి తిప్పారపు శ్రావణ్, వజ్జపల్లి శ్రీకాంత్, నాయకులు దేశెట్టి శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, పున్ని రాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి


కలెక్టరేట్‌కు తరలివచ్చిన గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : కబ్జాకు గురవుతున్న భూపతినగర్ శ్మశాన వాటికను కాపాడాలని గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో భూపతినగర్‌ను ఆనుకొని ఉన్న భవానికుంట శిఖంలో భూమిలో 60 ఏళ్లుగా శ్మశాన వాటిక నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10 రోజుల క్రితం సిరిసిల్ల పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి అక్కడి స్థలం తనదంటూ చదును చేస్తుండగా వార్డు కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ కలిసి పనులను అడ్డుకున్నామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గౌతమి పూజారికి వినతి పత్రాన్ని అందించారు. ఆ భూమిని శ్మశానికి వాడుకుంటున్నామని ఈ భూమిలోనే శ్మశానాన్ని ఏర్పాటు చేసి స్థలం కబ్జాకు గురికాకుండా అధికారులు కాపాడాలంటూ అదనపు కలెక్టర్ గౌతమి పూజారిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. మాజీ ఉపసర్పంచ్ అంజయ్య, నరహరి, కుమార్, దేవదాస్, భూమయ్య, బైరి రాజేశం, జీ. శ్రీనివాస్, సుదర్శన్, సాయి, మల్లేశం, శ్రీహరి, మధు, శ్రీకర్ పాల్గొన్నారు.